క్లుప్తంగా

నేడు 31వ వార్డులో 'గడప గడపకు మన ప్రభుత్వం'

సత్తెనపల్లి: రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం పట్టణంలోని 1వ సచివాలయ పరిధిలోని (రైల్వే గేట్ దగ్గర) 31వ వార్డు లో మంగళవారం సాయంత్రం 3.30 గంటలకు జరుగుతుందని చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు చల్లంచర్ల సాంబశివరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమాన్ని రాష్ట్ర మంత్రి అంబటి రాంబాబు చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. కౌన్సిలర్లు, ప్రజా ప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, వివిధ శాఖల అధికారులు, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు హాజరు కావాలని కోరారు. ఆయనతో పాటు మున్సిపల్ వైస్ చైర్మన్లు షేక్ నాగూర్ మీరాన్, రమావత్ కోటేశ్వరరావు నాయక్, కౌన్సిలర్ అచ్యుత శివప్రసాద్ ఉన్నారు.

సకాలంలో విద్యుత్ బిల్లు చెల్లించాలి

నకరికల్లు: సకాలంలో విద్యుత్ బిల్లు చెల్లించాలని, మరుసటి నెలలో సర్‌చార్జి, ఆలస్యపు ఫీజు ఉండదని విద్యుత్‌శాఖ ఏఈ రూఫస్ డానియేల్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. నెల 14న స్థానిక విద్యుత్ సబ్ స్టేషన్‌లో విద్యుత్ బిల్లులు చెల్లించేందుకు ప్రత్యేక క్యాంపు ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించారు. మంగళవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 1గంట వరకు సిబ్బంది అందుబాటులో ఉంటారని బిల్లులు చెల్లించి విద్యుత్‌శాఖ అభివృద్ధికి సహకరించాలని కోరారు.

ఎంపీటీసీ చినమాబు మృతి


చినమాబు (పాతచిత్రం)

మాదల(ముప్పాళ్ళ): మండలంలోని మాదల-2 ఎంపీటీసీ షేక్ గుంటూరు చినమాబు అనారోగ్యంతో సోమవారం మృతి చెందారు. చినమాబు గతంలో గ్రామ ఉప సర్పంచ్, సొసైటీ అధ్యక్షుడిగా పనిచేశారు. ప్రస్తుతం మాదల-2 ఎంపీటీసీగా వైఎస్సార్ సీపీ బలపరిచిన అభ్యర్థిగా గెలుపొందారు. చినమాబు మృతి పలువురు వైఎస్సార్‌సీపీ నేతలు సంతాపం వ్యక్తం చేశారు. నాయకులు ఎంజీఎం రామలింగారెడ్డి, కానాలపుల్లారెడ్డి, చిమటాశ్రీనివాసరావు, శిరిగిరిగోపాలరావు, సొసైటీ అధ్యక్షుడు వెంకటరెడ్డి, మాదల ఎంపీటీసీ-1 గోగుల అంజిబాబు, ఉప సర్పంచ్ యలవర్తిపాటి సైదా మృతదేహాన్ని సందర్శించి, నివాళులర్పించారు.

వైభవంగా వీరభద్రస్వామి పళ్లెర మహోత్సవం



అచ్చంపేట: స్థానిక శ్రీ భద్రకాళీ సమేత వీరభద్రస్వామి పళ్లెర మహోత్సవాలు సోమవారం వైభవంగా ప్రారంభమైనాయి. పుణ్యాహవచనము, గణపతి పూజ, శివలింగారాధనలు, మహో సంకల్పం, పంచామృతం, దశామృతాలతో స్వామికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. స్వామికి అష్టహారతులు పట్టారు. పులిపాటి పద్మ ఆధ్వర్యంలో మహిళా విభాగం లలితా, విష్ణు సహస్రనామార్చన పారాయణ నిర్వహించారు. లక్ష్మీ తిరుపతాంబ భజన సమాజం భజన కార్యక్రమాలు చేపట్టింది. మంగళవారం స్వామి పళ్లెరము, వీర శైవుల ఖడ్గాలు, నారసములు, మేళ తాళాలతో వీరంగం చేస్తూ ఊరేగింపు కార్యక్రమాలు జరుగుతాయని నిర్వాహకులు తెలిపారు. అనంతరం మధ్యాహ్నం 12గంటల నుంచి అన్నదాన కార్యక్రమం జరుగుతుందని చెప్పారు.

ఉత్సాహంగా వనిత కార్క్ బాల్ టోర్నీ

పిడుగురాళ్ల: పట్టణంలోని స్కాలర్ డిగ్రీ కాలేజీ గ్రౌండ్‌లో వనిత వార పత్రిక ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కార్క్‌బాల్ టోర్నమెంట్‌ను రెండోరోజు సోమవారం పట్టణానికి చెందిన ప్రముఖ డాక్టర్ ఉన్నం నాగమల్లికార్జునరావు ప్రారంభించారు. రెండో రోజు భార్గవ్ సీసీ భారత్ సీసీ మధ్య మొదటి మ్యాచ్ నిర్వహించగా భార్గవ్ సీసీ గెలుపొందింది. రెండో మ్యాచ్ మున్నా సీసీ, గణేష్ సీసీ మధ్య జరగగా గణేష్ సీసీ గెలుపొందింది. మూడో మ్యాచ్ గుత్తికొండ సీసీ, వివేకానంద సీసీ మధ్య జర్గా వివేకానంద్ సీసీ విజయం సాధించింది.

మహిళ బ్యాగులో నగలు చోరీ

వినుకొండ (నూజెండ్ల): వినుకొండ ఆర్టీసీ బస్టాండ్‌లో ప్రయాణీకురాలి బ్యాగులో నుంచి బంగారం ఆభరణాలు గుర్తు తెలియని వ్యక్తులు చోరీ చేశా రు. కర్నూలు జిల్లా నంది కొట్కూరుకు చెందిన మహిళలు మాచర్ల వెళుతూ బస్సు ఎక్కుతున్న సమయంలో బ్యాగు కత్తిరించి అందులోని బంగారు నగలు చోరీ చేశారు. సమాచారం తెలుసుకున్న వినుకొండ పోలీసులు సీసీ ఫుటేజీ ఆధారంగా దర్యాప్తు చేపట్టారు. చోరీకి గురైన బంగారం విలువ రూ.10 లక్షలు ఉంటుందని బాధితులు తెలిపారు.

పాఠశాల ప్రగతికి.. పక్కా ప్రణాళిక

- 2023-24 వార్షిక కార్యాచరణలో విద్యాశాఖ
- దీని ఆధారంగానే బడ్జెట్‌లో నిధులు విడుదలయ్యే అవకాశం
- పాఠశాల నుంచి జిల్లా స్థాయి వరకు కసరత్తు


భట్లూరు మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల

సత్తెనపల్లి: బడ్జెట్ రూపకల్పనలో ప్రణాళిక తప్పనిసరి. ప్రణాళిక ఆధారంగా నిధులు కేటాయింపులుంటాయి. సమస్యల పరిష్కారానికి, మౌలిక వసతుల కల్పనకు, పాఠశాలల అభివృద్ధికి క్షేత్రస్థాయిలో పటిష్ట ప్రణాళికలు రూపొందించేందుకు ఏపీ విద్యాశాఖ నడుబిగించింది. పాఠశాల స్థాయి నుంచి సమస్యలు గుర్తించి వచ్చే విద్యా సంవత్సరంలో నిధులు సమకూర్చుకునేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తోంది ఏపీ సమగ్ర శిక్షా. ఆవాస ప్రాంతం, పాఠశాల స్థాయిలో అవసరాలకనుగుణంగా ప్రణాళికలు రూపొందించే పనిలో ఉపాధ్యాయులు నిమగ్నమయ్యారు. తద్వారా మండల, జిల్లా స్థాయిలో ప్రణాళికలు రూపొందించి రాష్ట్ర స్థాయికి పంపించనున్నారు. అక్కడ ప్రణాళిక సలహా సంస్థకు ఆమోదం కోసం పంపిస్తారు. వీటి ఆధారంగానే పాఠశాలలకు నిధులు మంజూరు కానున్నాయి. ప్రస్తుతం సత్తెనపల్లి విద్యా డివిజన్ పరిధిలో ప్రణాళికలు రూపొందించే పని సాగుతోంది.

సూక్ష్మస్థాయి ప్రణాళిక

పాఠశాలల అవసరాల అనుగుణంగా బడ్జెట్ రూపొందించేందుకు మైక్రో లెవెల్ ప్లానింగ్ అమలు చేస్తున్నారు అధికారులు. క్షేత్రస్థాయి అవసరాలు గుర్తించాలనేది మైక్రో లెవెల్ ప్లానింగ్ ముఖ్య ఉద్దేశం. ఇందుకు 2021-22 యూ-డైస్ (యూనిఫైడ్ డిస్ట్రిక్ట్ ఇన్ఫర్మేషన్ సిస్టం) ను ప్రాతిపదికగా తీసుకోవాల్సి ఉంటుంది. యూ-డైస్ లోని వివరాల ఆధారంగా చేసుకుని పాఠశాల స్థాయిలో ప్రణాళికలు తయారు చేసుకోవాల్సి ఉంటుంది. ఇక్కడ గుర్తించిన అవసరాలనుగుణంగా.. మండల స్థాయి, మండల స్థాయిలో గుర్తించిన అంశాల ఆధారంగా జిల్లాస్థాయి ప్రణాళికలు రూపొందిస్తారు. గతంలో ఉమ్మడి జిల్లా ప్రాతిపదిక ఏ డబ్ల్యూపీ అండ్ బీ(యాన్యువల్ వర్క్ ప్లాన్ అండ్ బడ్జెట్) తయారు చేసేవారు. ఇప్పుడు నూతనంగా ఏర్పడిన జిల్లాల వారీగా ప్రణాళికలు సిద్ధం చేయాల్సి ఉంటుంది.

నూతన జాతీయ విద్యా విధానం ప్రకారం

ప్రస్తుతం రాష్ట్రంలో ఎన్ఈపీ-2020 (నేషనల్ ఎడ్యుకేషన్ పాలసీ) అమలవుతోంది. ప్రస్తుత జాతీయ విద్యా విధానంలో భాగంగా ప్రీ ప్రైమరీ నుంచి 12వ తరగతి వరకు ఆరు విభాగాలుగా తరగతులను విభజించారు. నూతన జాతీయ విద్యా విధానాన్ని దృష్టిలో ఉంచుకొని ఆవాస ప్రాంత ప్రణాళికలు, పాఠశాల అభివృద్ధి ప్రణాళికలు సిద్ధం చేసుకోవాల్సి ఉంటుంది. గతంలో 1-8, 9-10, 11, 12 తరగతులకు వేర్వేరుగా ప్రణాళికలు రూపొందించేవారు. ఇప్పుడా పరిస్థితి ఉండదు. గతంలో ఎస్ఎస్ఏ, ఆర్ఎంఎస్ఏ పాఠశాల విద్యాశాఖ విభాగాలుగా ఉండగా, వీటన్నిటిని ఒకే గొడుగు కిందకు తీసుకువచ్చి ఏపీ సమగ్ర శిక్షాగ మార్చారు. పాఠశాల, హేబిటేషన్, క్లస్టర్, మండల, జిల్లా స్థాయి ప్రణాళికల తయారీకి ఏపీ సమగ్ర శిక్షా ఇటీవల షెడ్యూల్ విడుదల చేసింది.

ప్లానింగ్ ప్రక్రియ నడుస్తోంది..

ప్రస్తుతం యూ-డైస్‌లో భాగంగా ప్లానింగ్ ప్రక్రియ నడుస్తోంది. ఇది త్వరితగతిని పూర్తి చేస్తే షెడ్యూల్ ప్రకారం జిల్లా నుంచి రాష్ట్ర స్థాయికి వెళ్తుంది. పాఠశాల స్థాయిలో అవసరాలు గుర్తించే విధంగా ప్రణాళిక చేపట్టడం జరుగుతోంది.

- ఎ.శ్రీనివాసరావు, మండల విద్యాశాఖాధికారి, సత్తెనపల్లి

జగనన్న వరం.. జన సంక్షేమం

- ఎమ్మెల్యే నంబూరు శంకరరావు స్పష్టీకరణ
- రామాపురంలో గడప గడపకు మన ప్రభుత్వం


లబ్ధిదారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శంకరరావు తదితరులు

పెదకూరపాడు (అమరావతి): ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మూడున్నరేళ్ల పాలనలో అమలైన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు పేదల పాలిట వరాలుగా మారాయని పెదకూరపాడు శాసన సభ్యుడు నంబూరు శంకరరావు పేర్కొన్నారు. సోమవారం రామాపురం గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం జరిగింది. ఎమ్మెల్యే ఇంటింటికీ వెళ్లి ప్రతి ఒక్కరినీ ఆప్యాయంగా పలకరించారు. సమస్యలు అడిగి తెలుసుకున్నారు. గ్రామస్తులు పలు సమస్యలను ఎమ్మెల్యే శంకరరావు దృష్టికి తీసుకొచ్చారు. ఆయన వెంటనే పరిష్కారానికి అధికారులను ఆదేశించారు. అర్హులందరికీ రేషన్ కార్డులు, ఇళ్ల స్థలాలు ఇవ్వాలని సూచించారు. అనంతరం మాట్లాడుతూ రామాపురం గ్రామంలో ప్రతి ఇంటికీ రూ.30 లక్షల జల్‌జీవన్ మిషన్ నిధులతో తాగునీటి కొళాయి కనెక్షన్లు ఉచితంగా మంజూరు చేశామని వివరించారు. పాదయాత్రలో ఇచ్చిన హామీలన్నీ సీఎం జగనన్న అమలు చేశారని కొనియాడారు. కరోనా సంక్షోభంలోనూ పథకాలు ఆగలేదని గుర్తుచేశారు. వైఎస్సార్ సీపీకి ప్రజల్లో పెరుగుతున్న ఆదరణ చూసి ఓర్వలేక ప్రతిపక్షాలు అసత్య ప్రచారాలు చేస్తున్నాయని విమర్శించారు. 2024 ఎన్నికలలో ప్రజలు ప్రతిపక్షాలను తిప్పికొడతారని స్పష్టం చేశారు. గ్రామంలో మొత్తం 250 గడపలను ఎమ్మెల్యే సందర్శించారు.

రూ.5.60 కోట్లతో సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు

రామాపురం గ్రామంలో ఈ మూడున్నరేళ్ల కాలంలో రూ.5.60 కోట్లతో సంక్షేమంతోపాటు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టినట్లు ఎమ్మెల్యే శంకరరావు చెప్పారు. నవరత్న పథకాలతో రూ.4.80కోట్ల మేర లబ్ధి చేకూరిందని వివరించారు. రూ.79 లక్షలతో అభివృద్ధి పనులు చేశామని వెల్లడించారు.

చిరుధాన్యాలపై అవగాహన


అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

దొడ్లేరు(క్రోసూరు): దొడ్లేరు రైతుభరోసా కేంద్రం-2లో సోమవారం చిరుధాన్యాలపై అవగాహన కార్యక్రమం, ర్యాలీ నిర్వహించారు. ముఖ్యఅతిథిగా జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ సాయి మార్కొండారెడ్డి పాల్గొని మాట్లాడారు. 2023 సంవత్సరాన్ని అంతర్జాతీయ చిరుధాన్యాల సంవత్సరంగా ప్రకటించినట్టు వివరించారు. చిరుధాన్యాల సాగు పెరగాలని పేర్కొన్నారు. ప్రకృతి వ్యవసాయం డీపీఎం కె.అమలకుమారి మాట్లాడుతూ 18 రకాల చిరుధాన్యాలు కలిగి ఉన్న మిశ్రమాన్ని ప్రధాన పంటకు ముందుగా సాగు చేసి కలియదున్నాలని చెప్పారు. భూమిలో సూక్ష్మజీవులు, వానపాములు పెరిగి భూమి సారవంతమవుతుందని వివరించారు. అనంతరం చిరుధాన్యాలపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో క్రోసూరు ఏడీఏ హనుమంతరావు, జిల్లా వనరుల కేంద్రం డీడీఏ శివకుమారి, ఏడీఏ బి.వి.శివకుమారి, ఐదు మండలాల వ్యవసాయ అధికారులు, రైతు భరోసా కేంద్రాల సిబ్బంది, గ్రామ సర్పంచ్ ముక్క అంజలి, జెడ్పీటీసీ సభ్యులు షేక్ జమీలా, ఎంపీపీ కోటయ్య, అనుముల శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఇంటికొచ్చిన ఫ్యామిలీ డాక్టర్..


వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ రవితేజ

రాజుపాలెం: మండలంలోని రెడ్డిగూడెం గ్రామ సచివాలయంలో ఫ్యామిలీ డాక్టర్ సోమవారం వైద్య సేవలు అందించారు. వైద్యాధికారి డాక్టర్ రవితేజ నాయక్ 114 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి, మందుల ఇచ్చారు. వీరిలో 61 మంది బీపీ, 39 మంది షుగర్ పేషంట్లు ఉన్నారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రం, ప్రాథమిక పాఠశాలల్లో పిల్లలకు వైద్య పరీక్షలు నిర్వహించారు. మధ్యాహ్న భోజనాన్ని పరీక్షించారు. మంచానికే పరిమితమైన రోగుల ఇళ్లకు వెళ్లి వైద్య పరీక్షలు చేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ సీవీ రమణ, ఎంఎల్‌హెచ్‌పీ జ్యోత్స్న, చెవుల పూర్ణ చంద్రరావు, ఏఎన్ఎం ప్రమీళ, ఆశ కార్యకర్తలు భ్రమరాంబ, రాణి తదితరులు పాల్గొన్నారు.

తొండపిలో ఫ్యామిలీ ఫిజీషియన్

తొండపి(ముప్పాళ్ళ): మండలంలోని తొండపి గ్రామంలో ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమం సోమవారం జరిగింది. ఈ కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యులు ఎస్.సూర్యప్రకాశరావు, జయకృష్ణ పాల్గొని 202 మందికి వైద్య సేవలందించారు. అవసరమైన వారికి రక్త, బీపీ, షుగర్ పరీక్షలు నిర్వహించి, మందులు అందించారు. మధ్యాహ్నం నుంచి అనారోగ్యంతో బాధపడుతూ మంచానికే పరిమితమైన వారి వద్దకు వెళ్లి అవసరమైన వైద్య సేవలందించారు. కార్యక్రమంలో సూపర్ వైజర్లు రవిచంద్ర, ఎ.పీటర్‌డానియేన్, భవానికుమారి, ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

ధర్నాలో పాల్గొనేందుకు అనుమతివ్వండి..



ముప్పాళ్ళ: ఏపీ గ్రామ రెవెన్యూ సహాయకుల సంఘం రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు మంగళవారం పల్నాడు జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద జరిగే మహా ధర్నాలో పాల్గొనేందుకు అనుమతి ఇవ్వాలని సంఘం నాయకులు సోమవారం తహసీల్దారు ఎం. భవానీశంకర్‌కు వినతిపత్రం అందించారు. ఫేస్‌యాప్ అటెండెన్స్, బయో మెట్రిక్ మినహాయింపు, కనీస వేతనం రూ.26వేలు, డీఏతో కూడిన వేతనం, అర్హత కలిగిన వీఆర్ఏలకు వీఆర్ఓలుగా ఉద్యోగోన్నతి తదితర డిమాండ్ల సాధనకు ధర్నాలో పాల్గొనున్నట్లు వారు తెలిపారు. వీఆర్ఏల సంఘం నాయకులు షేక్ సుభాని, ఆర్.శివపార్వతి, చావా మహంకాళయ్య, చింతపల్లి మరియదాసు తదితరులు ఉన్నారు.

యువకుడిపై దాడి

చిలకలూరిపేటటౌన్: వ్యక్తిపై చాకుతో దాడి చేసి గాయపరిచిన ఘటన సోమవారం జరిగింది. అర్బన్ పోలీసులు వివరాల ప్రకారం పట్టణంలో మదర్‌థెరిస్సా కాలనీకి చెందిన కోవూరి కృష్ణ బేల్దారిగా జీవనం కొనసాగిస్తాడు. అదే ప్రాంతానికి చెందిన దుర్గారావుతో అతనికి కొన్ని వివాదాలు ఉన్నాయి. ఈ క్రమంలో వారం కిందట దుర్గారావు ఆ ప్రాంతం నుంచి ఇల్లు ఖాళీ చేసి వెళ్లి పోయాడు. ఆదివారం రాత్రి దుర్గారావు మరో ఇరువురు యువకులతో కలసి మదర్‌థెరిస్సా కాలనీలోని కృష్ణ ఇంటి సమీపంలో చాకుతో పొట్ట, వీపుపై విచక్షణారహితంగా దాడి చేసి గాయపరిచారు. గమనించిన స్థానికులు గాయపడిన కృష్ణను పట్టణంలోని ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

వినుకొండ నుంచి 60 ప్రత్యేక బస్సులు

శావల్యాపురం: మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా వినుకొండ డిపో నుంచి ప్రత్యేకంగా ఆర్టీసీ సర్వీసులు నడుపుతున్నట్లు డిపో మేనేజరు కె.కోటేశ్వరనాయక్ సోమవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శివరాత్రి పర్వదినం వేడుకలకు 60 ప్రత్యేక బస్సులు నడుపుతున్నట్లు చెప్పారు. వినుకొండ నుంచి కోటప్పకొండ తిరునాళ్లకు 35 బస్సులు, శ్రీశైలంకు 14 బస్సులకు త్రిపురాంతకం-06, మన్నెపల్లి-05 బస్సు సర్వీసులు ప్రత్యేకంగా ఆర్టీసీ ఉన్నతాధికారులు అనుమతితో ఏర్పాటు చేశామన్నారు. శివరాత్రి పర్వదినం సందర్భంగా వేడుకలు జరుగు ప్రాంతాల్లో ఆర్టీసీ అధికారుల పర్యవేక్షణలో ప్రత్యేక శిబిరాలు ఏర్పాటు చేసి ప్రయాణికులకు మెరుగైన సేవలు అందించే విధంగా చర్యలు తీసుకున్నట్లు చెప్పారు.

మినరల్ వాటర్ ప్లాంట్ ప్రారంభం


మినరల్ వాటర్ ప్లాంట్ ప్రారంభిస్తున్న ఫాదర్ రాయప్ప తదితరులు

అచ్చంపేట: తాళ్లచెరువు ఎస్సీ కాలనీలో మిషన్ రుహ సంస్థ సహకారంతో నిర్మించిన ఉచిత మినరల్ వాటర్ ప్లాంటును సోమవారం ఫాదర్ రేపూడి రాయప్ప ప్రారంభించారు. ప్లాంటు షెడ్, వాటర్ ఫిల్టర్ మిషన్, మిషనరీ తదితర పరికరాలను పాదర్ రాయప్ప తని సొంత ఖర్చులతో విరాళంగా ఇచ్చారు. వచ్చే వేసవి సమయంలో కాలనీ వాసులు మినరల్ వాటర్ ప్లాంటు ద్వారా ఫిల్టర్ చేసిన శుద్ధ మంచినీటిని సేవించి ఆరోగ్యకరంగా జీవించాలని రాయప్ప తెలిపారు. కార్యక్రమంలో సంస్థ అధ్యక్షులు ఫాదర్ ఉన్నం కిరణ్ కుమార్, ఉపాధ్యక్షులు వి.రమేష్ బాబ్జి, ఫాదర్స్ సీహెచ్ తామస్, ప్రశాంత్ జ్యార్నెస్, సర్వ సంస్థ అధినేత రేపూడి జయ్‌పాల్, రోజా ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

మహాశివరాత్రి ఉత్సవాలను జయప్రదం చేద్దాం

జడ్పీ వైస్ చైర్మన్ శౌంఠిరెడ్డి


సమీక్షలో మాట్లాడుతున్న జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ శౌంఠిరెడ్డి నర్సిరెడ్డి

రెంటచింతల: మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని సత్రశాల వద్ద వేంచేసిన గంగా భ్రమరాంబ సమేత మల్లికార్జునస్వామి దేవస్థానాన్ని సందర్శించే భక్తులకు సేవచేసేందుకు సమష్టిగా కృషిచేద్దామని జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ శౌంఠిరెడ్డి నర్సిరెడ్డి చెప్పారు. సోమవారం స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ షేక్ గౌసియాబేగం అధ్యక్షతన వివిధ శాఖాధికారులతో కలిసి నిర్వహించిన సమీక్షలో ఆయన మాట్లాడారు. స్వామి దర్శనానికి వచ్చే ప్రతి భక్తుడికీ శాంతిభద్రతలు, వైద్యఆరోగ్యం, రవాణా, విద్యుత్, పరిసరాల పరిశుభ్రత పరంగా ఎలాంటి ఇబ్బంది కలగకుండా చూడాల్సిన బాధ్యత అధికారులపైనే ఉందన్నారు. క్షేత్రస్థాయి సిబ్బందితో సమన్వయంతో పనిచేసినప్పుడే ఏర్పాట్లను సక్రమంగా నిర్వహించగలుగుతామన్నారు. వాహనాల పార్కింగ్ స్థలాన్ని అభివృద్ధి చేసేందుకు వెంటనే చర్యలు తీసుకోవాలని సూచించారు. కృష్ణానదిలో స్నానాలు చేసే సమయంలో గజ ఈతగాళ్లను నియమించాలన్నారు. అన్నదాన సత్రాల నిర్వహకులు అధికారులకు సహకరించాలన్నారు. భక్తుల దర్శనార్థం బారికేడ్లను ఏర్పాటు చేస్తున్నట్లు దేవస్థానం చైర్మన్ బద్దూరి బ్రహ్మారెడ్డి తెలిపారు. సమావేశంలో జెట్టిపాలెం సర్పంచ్ దావులూరి ఉదయకుమారి రమేష్, ఎంపీపీ దాసరి చాడేశ్వరి, పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ నర్రా కృష్ణారెడ్డి, ఎస్ఐ సయ్యద్ షమీర్ భాష, ఆర్‌డబ్ల్యుఎస్ ఏఈ కొత్తా నరేంద్రారెడ్డి, ఈవో గాదె రామిరెడ్డి, పార్టీ రాష్ట్ర యువజన కార్యవర్గ సభ్యుడు మోర్తల ఉమ, కార్యదర్శి బాలునాయక్, ఏపీ ట్రాన్స్‌కో ఏఈ షేక్ మస్తాన్‌వలి, ఆర్ఐ రాజారావు పాల్గొన్నారు.

108లో ప్రసవం

తల్లీబిడ్డ క్షేమం


ప్రసవం అనంతరం బిడ్డతో ఈఎంటీ సురేష్‌బాబు

దుర్గి: 108లో మహిళ ప్రసవించింది. ప్రస్తుతం తల్లీబిడ్డ క్షేమంగా ఉన్నారు. ఈ ఘటన దుర్గి మండలం పోలేపల్లి గ్రామంలో సోమవారం జరిగింది. పోలేపల్లి గ్రామానికి చెందిన కృపమ్మ పురిటినొప్పులతో బాధపడుతుంటే బంధువులు కారంపూడి 108 అంబులెన్స్‌కు సమాచారం అందించారు. ఈఎంటీ బత్తుల సురేష్‌బాబు, పైలెట్ జె.సుందర్‌సింగ్ నాయక్ అక్కడకు వెళ్లి కృపమ్మను అంబులెన్సు ఎక్కించారు. ఆమెకు నొప్పులు ఎక్కువ కావడంతో అందులోనే కాన్పు చేయించారు. కృపమ్మ రెండో కాన్పులో మగబిడ్డకు జన్మనిచ్చారు. కాన్పు చేయించిన వెంటనే దగ్గరలోని ముటుకూరు పీహెచ్‌సీకి ఆమెను, బిడ్డను తరలించారు. తల్లీబిడ్డ క్షేమంగా ఉన్నారు.

తాగునీటి సమస్య పరిష్కారానికి చర్యలు


నగర పంచాయతీ పరిధిలోని 1వ వార్డులో పర్యటిస్తున్న చైర్మన్ సాంబయ్య, కమిషనర్ శ్రీవిద్య

దాచేపల్లి : నగర పంచాయతీ పరిధిలోని 1వ వార్డులో మంచినీటి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని చైర్మన్ కొప్పుల సాంబయ్య చెప్పారు. 1వ వార్డులో సోమవారం చైర్మన్, కమిషనర్ అనిశెట్టి శ్రీవిద్య పర్యటించి ప్రజలతో మాట్లాడారు. 1వ వార్డులో మంచినీటి సమస్య పరిష్కారానికి స్థానిక ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి రూ.10 లక్షల నిధులు మంజూరు చేశారని, ప్రతి ఇంటికీ శుద్ధి చేసిన తాగునీటిని అందిస్తామని చైర్మన్ సాంబయ్య చెప్పారు. 1వ వార్డులో నెలకొన్న సమస్యల పరిష్కారానికి ఎమ్మెల్యే కాసు ప్రత్యేక దృష్టి పెట్టారని, రానున్న రోజుల్లో మరిన్ని నిధులతో సిమెంట్ రోడ్లు, డ్రెయినేజీలు నిర్మిస్తామని ఆయన తెలిపారు. ఈ పరిశీలనలో కౌన్సిలర్ చాట్ల క్రాంతికుమార్, మార్కెట్‌యార్డు మాజీ డైరెక్టర్ బండ్ల ఏసుపాదం, నాయకులు కొమ్ము బుజ్జి, బండ్ల యాకోబు, అఖిల్, సాగర్, కోటయ్య, డేవిడ్, మరియదాసు తదితరులు పాల్గొన్నారు.

క్షయ రోగులకు పౌష్టికాహారం కిట్లు పంపిణీ


క్షయ రోగులకు పౌష్టికాహార కిట్లు అందచేస్తున్న మెడికల్ ఆఫీసర్ కృష్ణకుమార్

క్రోసూరు: క్రోసూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సోమవారం మూడు మండలాల క్షయ రోగులకు పౌష్టికాహార కిట్లు పంపిణీ చేశారు. కార్యక్రమానికి ఎంపీపీ పి.కోటయ్య, జెడ్పీటీసీ సభ్యులు షేక్ జమీలా, రాజుపాలెం మెడికల్ ఆఫీసర్ వెంకటకృష్ణ కుమార్, పాల్గొని కిట్లు అందజేశారు. ఈసందర్భంగా కృష్ణమోహన్ మట్లాడుతూ అచ్చంపేట, క్రోసూరు, బెల్లంకొండ మండలాల్లోని 41 మంది క్షయ రోగులకు నిక్షయమిత్ర ఫుడ్ బాస్కెట్ పేరుతో పౌష్టికాహార కిట్లు అందిస్తున్నట్లు తెలిపారు. గోధుమ పిండి కిలో, రాగిపిండి కిలో, బెల్లం అరకిలో, బియ్యం మూడు కిలోలు, వేరుశనగగుండ్లు అరకిలో , కందిపప్పు కిలో, నూనె అరకిలో అందజేసినట్లు వెల్లడించారు. రోగులు క్రమం తప్పకుండా మందులు వేసుకుంటూ పౌష్టికాహారాన్ని తీసుకోవాలని వివరించారు. కార్యక్రమంలో చిల్కా రవి, మేదర రోశయ్య, ఎస్టీసీ సౌజన్య, యల్‌డీసీ జానీబాషా, సీహెచ్‌వో సాంబశివరావు, ఎంపీహెచ్ఎస్ కేవీ శివుడు పాల్గొన్నారు.

బాలల హక్కులను పరిరక్షించాలి


ఉపాధ్యాయులతో మాట్లాడుతున్న బత్తుల పద్మావతి

నాదెండ్ల: బాలల హక్కుల పరిరక్షణకు సమాజంలోని ప్రతి ఒక్కరూ చిత్తశుద్ధితో పాటుపడాలని ఏపీ స్టేట్ కమిషన్ ఫర్ ప్రొటెక్షన్ ఆఫ్ చిల్డ్రన్ రైట్స్ డైరెక్టర్ బత్తుల పద్మావతి చెప్పారు. మండల కేంద్రమైన నాదెండ్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను సోమవారం ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి పాలనలో ప్రభుత్వ విద్య, వైద్యరంగం బలోపేతానికి విశేష కృషి చేస్తున్నార న్నారు. బాలల అక్రమ రవాణా, చిన్నారులపై జరు గుతున్న వేధింపులను పెద్దలు, ఉపాధ్యాయు లు నివారించాలన్నారు. బడి మానేసిన చిన్నారులను తిరిగి బడిలో చేర్పించి వారు విద్యావంతులయ్యేలా ఉపాధ్యాయులు, సచివాలయ మహిళా పోలీసులు పనిచేయాలన్నారు. వారిహక్కుల పరిరక్షణకు పూర్తి రక్షణ కల్పించాలన్నారు. అనంతరం పాఠశాలలో అమలౌతున్న మధ్యాహ్న భోజన పథకం, టాయిలెట్స్, హాస్టల్‌లో ఉండే విద్యార్థుల సౌకర్యాలను పరిశీలించారు. ఎంఈవో ఆంజనేయులు, ఐసీడీఎస్ ప్రాజెక్టు అధికారి శాంతకుమారి, హెచ్ఎం శ్రీనివాసరావు, కెల్లంపల్లి రెడ్డియ్య చౌదరి పాల్గొన్నారు.

స్త్రీనిధి రుణాలతో ఆర్థిక ప్రగతి సాధించాలి

శావల్యాపురం: స్త్రీనిధి రుణాలు ద్వారా స్వయం సహాయక మహిళా సంఘాల్లోని మహిళలు అర్థిగ ప్రగతి సాధించాలని స్త్రీనిధి మేనేజరు రంతు చిన బుల్లెయ్య అన్నారు. సోమవారం స్థానిక వైఎస్సార్ క్రాంతి పథకం కార్యాలయంలో మేనేజరు చినబుల్లెయ్య మాట్లాడుతూ నియోజకవర్గంలో ఐదు మండలాలు రూ.29 కోట్లు రుణాలను 5700 మంది మహిళా సభ్యులకు ఇవ్వాల్సి ఉండగా ఇప్పటి వరకు 3970 మంది స్వయం సంఘాల్లోని మహిళా సభ్యులకు రూ.18 కోట్లు రుణాలను మంజూరు చేశామన్నారు. అందులో శావల్యాపురం మండలంలో రూ. 5 కోట్లు రుణాలను 980 మంది సభ్యులకు రుణాలను మంజూరు చేసి జిల్లాలో ప్రథమస్థానం నిలిచినట్లు చెప్పారు. గ్రామీణ ప్రాంతాల్లోని చిరు వ్యాపారులైన మహిళలు అభ్యున్నతి కోసం ప్రభుత్వం ప్రత్యేక చొరవ చూపుతుందన్నారు. స్త్రీనిధి రుణాలు తీసుకున్న మహిళా సభ్యులు రుణాలు చెల్లింపుల సమయంలో తప్పనిసరిగా రశీదులు పొందాలన్నారు. ఆయనతో పాటు సీసీలు ఖజావలీ, బేబిరాణి,రమాదేవి, యానిమేటర్లు ఉన్నారు.

ఘనంగా పుస్తకావిష్కరణ

నరసరావుపేట ఈస్ట్: శ్రీకోలవెన్ను రామకోటేశ్వరరావు సాహితీపీఠం ఆధ్వర్యంలో త్రిభాష పండితుడు డాక్టర్ కాసులనాటి నాగరాజశర్మ రచించిన త్రివేణి, మీనాక్షి పంచరత్నాలు పుస్తకాలను ఆవిష్కరణ నిర్వహించినట్లు సాహితీపీఠం ప్రధాన కార్యదర్శి ఇందిరా శాస్త్రి సోమవారం తెలిపారు. శ్రీనరసరావుపేట కళావేదికలో త్రిభాష లఘు కావ్యం త్రివేణి పుస్తకాన్ని సాహితీవేత్త డాక్టర్ చేరెడ్డి మస్తాన్‌రెడ్డి, మీనాక్షి పంచరత్నాలు పుస్తకాన్ని పి.వి.యస్.ఆర్.ప్రసాదరావు ఆవిష్కరించారు. సాహితీపీఠం వ్యవస్థాపక కార్యదర్శి గంధం యాజ్ఞవల్క్యశర్మ, డాక్టర్ పోలేపెద్ది రాధాకృష్ణమూర్తి, రత్నాకరం రాము, డాక్టర్ కె.వి. కోటయ్య తదితరులు పాల్గొన్నారు.